క్లుప్తంగా

25 నుంచి అష్టలక్ష్మీ ఆలయంలో 'శ్రావణ' పూజలు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకు శ్రావణ మాస పూజలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 25న కలశారాధనం, 28న గోదా అమ్మవారి అభిషేకం, 29న గరుడాళ్వార్ అభిషేకం, 31న సుదర్శన స్వామి అభిషేకం, ఆగస్టు 1న రజత కవచధారణ ఉంటాయని పేర్కొన్నారు. అలాగే ఆగస్టు 8న మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, వజ్రకవచధారణ, 9వ తేదీన శ్రావణ పూర్ణిమ లక్ష్మీనారాయణుల అభిషేకం, 15న 108 పట్టు చీరలతో వస్త్రార్చన, 22న విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు తెలిపారు.

ఎరువుల పంపిణీ

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి రైతు సేవా కేంద్రంలో సోమవారం ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ గ్రామ సహాయకులు ఉమా పార్వతి, మాజీ సర్పంచ్ పల్లి మహేష్, మహంతి అప్పలరమణ, బార్నాల సత్య శ్రీనివాసరావు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

పద్మనాభం: పద్మనాభం కోపరేటివ్ సొసైటీలో త్రిసభ్య కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షునిగా మొకర అప్పలనాయుడు, సభ్యులుగా కొండపల్లి నారాయణప్పడు, కిలారి రమణ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సీఈవో కె.కోటేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, కె.రమణ పాల్గొన్నారు.

రుషికొండలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో స్వచ్ఛ భారత్ మిషన్, పర్యాటక శాఖ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.55 లక్షల వ్యయంతో డ్రెస్సింగ్ రూమ్స్, మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ పనులు వేగవంతంగా పూర్తి చేసి, పర్యాటకులకు అందుబాటులోకి తేవాలన్నారు.

శొంఠ్యాం వీఆర్వోపై ఫిర్యాదు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని అదే పంచాయతీ గుమ్మడివానిపాలెం గ్రామానికి చెందిన బొత్స రాము తహసీల్దార్‌కు సోమవారం ఫిర్యాదు చేశాడు. పంచాయతీలో సర్వే నంబర్ 123 పార్టు కొండ పోరంబోకు ప్రభుత్వ భూమి 5 సెంట్లలో నూకరాజు అనే వ్యక్తి భారీ నిర్మాణం చేపడుతున్నాడని, దీనికి వీఆర్వో సహకారం అందిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, అడంగల్, పహాణీ కాపీలు, నిర్మించిన బోర్‌వెల్ వివరాలు తహసీల్దార్‌కు అందించారు.

ఎంఈవో-2 శ్రీనివాసరావుకు సన్మానం

తగరపువలస: ఎంఈవో-2గా బాధ్యతలు చేపట్టిన భీమిలి మండలం తాటితూరు జెడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డొంకర శ్రీనివాసరావును ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యా కమిటీ ప్రతినిధులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాయత్రినగర్‌లో పారిశుధ్య పనుల పరిశీలన



గాయత్రినగర్‌లో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న వైద్యాధికారి కిషోర్

మధురవాడ: పీఎం పాలెం గాయత్రినగర్‌లో డయేరియా అదుపులోనే ఉందని జీవీఎంసీ జోన్-2 వైద్యాధికారి కిషోర్ తెలిపారు. ఇతర అధికారులతో కలిసి సోమవారం కాలనీని సందర్శించిన ఆయన అక్కడ ఫాగింగ్, బ్లీచింగ్, ఇతర పారిశుధ్య పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో 23మందికి డయేరియా సోకగా 22మంది పరిస్థితి నిలకడగా ఉందని, విజయలక్ష్మి అనే మహిళ నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని చెప్పారు. ఇక్కడ జీవీఎంసీ, యూపీహెచ్‌సీ సిబ్బంది నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. జాగ్రత్తలపై కాలనీలో మైక్ ద్వారా, ఇంటింటి ప్రచారం చేపట్టారు.



బాకూరుపాలెం కూడలిలో రహదారి దుస్థితి



గిడిజాల నుంచి పద్మనాభం మార్గంలో ..



బాకూరుపాలెం నుంచి నీళ్ల కుండీల వైపు ..

ఇలా వదిలేశారు..

మంత్రులు పర్యటిస్తేనే మరమ్మతులు చేస్తారా?



ముచ్చర్ల కూడలిలో రహదారిపై గోతులు

- ఆర్ అండ్ బి అధికారుల లీలలు
- ప్రపంచంలో మ్యాప్‌లన్నీ ఆ రోడ్లపైనే దర్శనం
- ఈ రోడ్లు బాగుపడేదెప్పుడా అని స్థానికుల ఎదురుచూపులు

పాలకులు

సంక్రాంతి నాటికి రోడ్లకు మహర్దశ అన్నారు.. అధికారులు కూడా రహదారి మరమ్మతులు పూర్తి చేసేశామని ప్రకటించేశారు. నిజమేనేమో అనుకున్న ప్రజలకు అధికారుల లీలలు కనిపించాయి. మంత్రులు పర్యటించిన ప్రాంతాల్లో రోడ్లు బాగుపడ్డాయి.. మిగిలిన రోడ్లు మాత్రం గతుకులతోనే మిగిలాయి. ఆనందపురం మండలవాసులకు అప్పుడర్థమైంది.. మిగిలిన రోడ్లు కూడా బాగు పడాలంటే అక్కడ మంత్రిగారో, ఎమ్మెల్యేనో పర్యటించాలని. లేదంటే.. ఇలానే గుంతల దారుల్లో అవస్థలు పడాలని..



ముచ్చర్ల నుంచి నీళ్లకుండీల వైపు ..



గిడిజాల, ముచ్చర్ల కూడళ్ల మధ్య

తగరపువలస: ఆనందపురం మండలం నీళ్లకుండీల కూడలి నుంచి పద్మనాభం వైపు వెళ్లే రహదారిని పరిశీలిస్తే ప్రభుత్వం, ఆర్ అండ్ బీ అధికారుల లీలలు కనిపిస్తాయి. 2024 ఎన్నికల తరువాత పలు వాయిదాలలో రహదారులకు మహర్దశ అంటూ ప్రకటనలు గుప్పించారు. ఎట్టకేలకు ఈ ఏడాది సంక్రాంతి తరువాత నీళ్లకుండీల నుంచి విజయనగరం వరకు రహదారికి మరమ్మతులు పూర్తి చేసినట్టు ప్రకటనలు కూడా ఇచ్చేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణం సాఫీగా సాగిపోతుందనుకున్నవారికి నిరాశే మిగిలింది. ఆ సమయంలో మంత్రులు ఈ మార్గంలో పర్యటించనున్న వరకే మరమ్మతులు పూర్తి చేసి మిగిలినవి గాలికి వదిలేశారు. దీంతో గిడిజాల కూడలి దాటిన మొదలుకుని ముచ్చర్ల, బాకూరుపాలెం, చిన్నయ్యపాలెం కూడళ్లతో పాటు పలుచోట్ల రోడ్లు ప్రపంచ మ్యాపులను తలపిస్తూ గోతులు ఏర్పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గోతుల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించలేక, వేగంగా వచ్చే వాహనాలను నియంత్రించలేక ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. చీకటిపడిన తరువాతే కాకుండా పగటివేళ కూడా ప్రమాదాలు సాధారణంగా మారిపోయాయి.

ఎప్పుడు ఎలా ప్రమాదం ముంచుకొస్తుందో..

నీళ్లకుండీలు విజయనగరం మార్గం ఆనందపురం, పద్మనాభం మండల ప్రజలకే కాకుండా కొత్తవలస, విజయనగరం, అలమండ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు దగ్గర మార్గం. ప్రస్తుతం శిథిలమైన రోడ్ల కారణంగా ఎక్కువగా ఆనందపురం మండలంలోని కుసులవాడ, శిర్లపాలెం, గిడిజాల, ముచ్చర్ల, ముకుందపురం, పందలపాక, బోని, శొంఠ్యాం, తర్లువాడ, రామవరం, భీమన్నదొరపాలెం, కోలవానిపాలెం పంచాయతీల ప్రజలు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు.

దగ్గర దారి కారణంగా ఈ మార్గాన్ని ఎంచుకున్న వారికి ప్రమాదాలు ఆహ్వానం పలుకుతున్నాయి. గోతులు ఉన్న చోట్ల వాహనాల వేగాన్ని నియంత్రించడానికి స్టాపర్లు కూడా లేకపోవడంతో ప్రమాదాల నియంత్రణ సాధ్యం కావడం లేదు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించేవారు ఇంటికి చేరే వరకు క్షేమంగా ఉంటామన్న నమ్మకం కోల్పోతున్నారు.

వందలాదిమంది రాకపోకలు

భవన నిర్మాణం, వ్యవసాయం, క్వారీ, ఇటుక బట్టీలు, హేచరీలు, ప్లైవుడ్ ఫ్యాక్టరీలలో పనుల కోసం ప్రతిరోజూ ఈ రహదారిపై బస్సులపైనే కాకుండా ఆటోలు, ద్విచక్రవాహనాలపై వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. నీళ్లకుండీలు–విజయనగరం రోడ్డు ఎప్పుడు బాగుపడుతుందోనని ఆనందపురం మండల ప్రజలు నిరీక్షిస్తున్నారు.

ఏ క్షణం ఏం జరుగుతుందో?



నీళ్లకుండీల నుంచి గిడిజాల కూడలి వరకే మరమ్మతులు చేసి అక్కడి నుంచి శిర్లపాలెం వరకు గోతులను పూడ్చలేదు. దీంతో రోడ్డుపైకి వచ్చామంటే ఏ క్షణం ఏమి జరుగుతుందో అని ఆందోళనగా ఉంటుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలి.

– గొంప సన్యాసిరావు, ముచ్చర్ల

స్కిడ్ అయి పడిపోతున్నారు



ఈ మార్గంలో చాలా వరకు గోతులతో పాటు రహదారికి ఇరువైపులా గ్రావెల్ చొచ్చుకుని రావడంతో ద్విచక్రవాహనదారులు తరచూ స్కిడ్ అవుతుంటారు. వర్షాకాలంలో ఈ గోతులు చెరువులుగా మారి వాహనాల రాకపోకలతో నీళ్లు తుళ్లి దుకాణాలు, పాదచారులను బురద నీళ్లతో ముంచెత్తుతున్నాయి.

– వరుపుల రాంబాబు, ఇచ్ఛాపురం

ఈ మార్గంలో ప్రయాణమంటేనే భయం



మేము కూలి పనుల కోసం విజయనగరం నుంచి వస్తుంటాం. గోతులు కారణంగా బస్సులలో కూడా ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరం. రోడ్లకు మరమ్మతులు చేస్తే తప్ప రాకపోకలు చేయడం కష్టం. అధికారులు రోడ్డు బాగు చేయాలి.

– బోదసింగు గోపాల్, చెల్లూరు

రోడ్డంతా గోతులే..



ఈ దారిలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులమంతా ఎక్కువగా నడచి వెళ్తుంటాం. లేదా వాహనదారులను లిఫ్ట్ అడిగి వెళ్తుంటాం. కానీ గోతులతో కూడిన రహదారులను చూస్తే భయమేస్తుంది. రోడ్లకు మరమ్మతులు చేస్తే చక్కగా వెళ్లిపోవచ్చు.

– వరుపుల రుషి, విద్యార్థి, శిర్లపాలెం

హెచ్‌పీసీఎల్ అధికారులకు ఐఐఎంవీలో శిక్షణ



ఐఐఎంవీలో శిక్షణకు హాజరైన హెచ్‌పీసీఎల్ అధికారులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన 580 మంది అధికారులకు 18 బ్యాచ్‌లుగా ఎలివేట్ శిక్షణ ఇవ్వనుంది. మూడు రోజుల వ్యవధి గల మొదటి బ్యాచ్‌కు సోమవారం శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఐఎంవీ డైరెక్టర్ ప్రొఫెసర్ అనురాధ మాట్లాడుతూ స్వీయ అవగాహన, కమ్యూనికేషన్, నాయకత్వం, నైతికతపై అధికారుల వ్యక్తిగత, వృత్తిపరమైన సామర్థ్యాలను పెంచడమే లక్ష్యంగా శిక్షణ ఉంటుందన్నారు. కోర్సు వివరాలను తెలియచేశారు. విశాఖ రిఫైనరీ మోడరనైజేషన్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అభిషేక్ త్రివేది మాట్లాడుతూ సాంకేతిక సామర్థ్యం, నిర్వాహక బాధ్యతల మధ్య వ్యత్యాసాన్ని తెలియజేశారు. హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ జి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో నెట్‌వర్కింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత గురించి వివరించారు. ఐఐఎంవీ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ సాధించిన అద్భుతమైన విజయాలు, కీలక కోణాలలో స్థిరమైన వృద్ధిని అభినందించారు.

రాష్ట్ర మాజీ సైనికుల సంఘం సభ్యుడిగా గురయ్యరెడ్డి

తగరపువలస: రాష్ట్ర మాజీ సైనికుల సంఘం ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా భీమిలికి చెందిన శ్రీచైతన్య మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కొయ్య గురయ్యరెడ్డి ఎన్నికయ్యారు. అనంతపురంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. గురయ్యరెడ్డిని విశ్రాంత సుబేదార్ మేజర్ మట్టా అప్పల నరసయ్యరెడ్డి, మాజీ సైనికులు అభినందించారు.

చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ మృతి



రామునాయుడు(ఫైల్)

పద్మనాభం: గత నెల 23న రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోరాడ గ్రామానికి చెందిన కోరాడ రామునాయుడు(48) ఆస్పత్రితో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ పద్మనాభం మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు సోదరుడైన కోరాడ రామునాయుడు విజయనగరం జిల్లా చింతలవలస ఏపీఎస్పీ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. బెటాలియన్ లోపలి నుంచి బైక్‌పై వస్తుండగా విజయనగరం జిల్లా డెంకాడ మండలం బెటాలియన్ గేట్ ఎదురుగా ఉన్న రోడ్డు మీద కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో రామునాయుడుకు బలమైన గాయాలవడంతో చికిత్స కోసం విశాఖ పట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ రామునాయుడు సోమవరం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

భౌతికకాయం వద్ద నివాళులు

కోరాడలో స్వగృహం వద్ద ఉంచిన రామునాయుడు భౌతిక కాయానికి పలువురు నివాళులర్పించారు. నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఆనందపురం జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, ఆనందపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు మజ్జి వెంకటరావు సందర్శించి నివాళులర్పించారు.

పింఛన్ ఇప్పించండి బాబూ..

- ఎమ్మెల్యేకు పండుటాకుల వినతి



పింఛన్ ఇప్పించాలని ఎమ్మెల్యే గంటాను కోరుతున్న వృద్ధురాలు

మధురవాడ: తమకు పింఛన్ ఇప్పించాలని 7వ వార్డు మల్లయ్యపాలేనికి చెందిన పలువురు వృద్ధులు, వితంతువులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. సోమవారం ఇక్కడ నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేకు తమ గోడు తెలిపారు. వృద్ధాప్య పింఛన్లు రావడం లేదని పెంటపల్లి నారాయణమ్మ, కొల్లి సూర్యకాంతం, కొల్లి కృష్ణ, నరవ సూరమ్మ, పెంటపల్లి సూరిబాబు తెలియజేశారు. వానపల్లి సీతారత్నం మాట్లాడుతూ తన భర్త మరణించి 6 నెలలు కావస్తున్నా ఆయనకి వస్తున్న పింఛన్ గానీ, వితంతు పింఛన్ గానీ రాలేదని వాపోయారు. పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

దివీస్‌లో ముగిసిన భద్రతా ఉత్సవాలు



ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చంద్రశేఖర్ వర్మ

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో 54వ భద్రతా ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆంధ్రప్రదేశ్ డి.చంద్రశేఖర్‌వర్మ మాట్లాడుతూ పనిప్రదేశంలో ఉద్యోగులు, కార్మికులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సంస్థ డైరెక్టర్ ఎస్.దేవేందరరావు, వైస్ ప్రెసిడెంట్ ఎల్.వి.రమణ మాట్లాడుతూ భద్రతకు తాము కల్పిస్తున్న ప్రాధాన్యత గురించి తెలియజేశారు. మూడు నెలల పాటు నిర్వహించిన ఈ భద్రతా ఉత్సవాలలో భాగంగా ఉద్యోగులు, కార్మికులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులకు ప్రత్యేక పోటీలు నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకరరెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్, దివీస్ జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, ఈహెచ్‌ఎస్ జి.ఎం.కె.సుబ్బారావు, ఐ.ఎల్.ప్రసాద్, రామకృష్ణ, రమేష్‌బాబు, భద్రతా అధికారి ఎం.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల ఔదార్యం

- విరాళాల ద్వారా మృతుని కుటుంబానికి ఆర్థిక సహకారం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ఏసీపీ అప్పలరాజు తదితరులు

పీఎం పాలెం: రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులకు విరాళాల రూపేణా సేకరించిన రూ.1లక్షా 58 వేల నగదును అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది. వివరాలివి.. సీబీఎం కాంపౌండ్ అమర్‌నగర్‌కు చెందిన పాట్నూరు శంకరరావు (41) ఈ నెల 18వ తేదీ రాత్రి మారికవలస కూడలికి సమీపంలో రోడ్డు దాటుతుండగా కాంక్రీట్ మిల్లర్ వాహనం ఢీకొనడంతో మరణించాడు. మృతుడికి భార్య జ్ఞానేశ్వరి, కుమార్తె విజ్ఞ (9), కుమారుడు నారాయణ తేజ్ (7) ఉన్నారు. కుటుంబ దీనస్థితి చూసిన పోలీస్ అధికారులు వారిని ఆర్థికంగా ఆదుకోవాలని సంకల్పించారు. జరిగిన విషయాన్ని ఎస్‌ఐ భాస్కరరావు వాట్సాప్‌లో స్టేటస్‌గా పెట్టారు. అది చూసి స్పందించిన సహచరులు, దాతలు మృతుని కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. అలా సేకరించిన నగదు రూ.1.58 లక్షలను విశాఖ నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ అప్పలరాజు చేతులమీదుగా సోమవారం సాయంత్రం మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ భాస్కరరావును సీఐ బాలకృష్ణ, ఏసీపీ అప్పలరాజు అభినందించారు.

జోన్-2 పీజీఆర్‌ఎస్‌కు 15 అర్జీలు



జోన్-2 జెడ్సీఅయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు



జోన్-1 జెడ్సీ కనకమహాలక్ష్మికి టీడీఆర్ సమస్యపై ఫిర్యాదు ఇస్తున్న 92 ఏళ్ల హనుమంతరావు

మధురవాడ: మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జోన్ పరిధిలోని 9 వార్డులకు సంబంధించి 15 అర్జీలు వచ్చాయని తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 3, ఈఈ వర్క్స్ 2, వాటర్ సప్లై 3, పబ్లిక్ హెల్త్ 1, ఎలక్ట్రికల్ 1, యూసీడీ 4, సూపరింటెండెంట్‌కు 1 చొప్పున వచ్చాయన్నారు. జీవీఎంసీ 5వ వార్డు జీసీసీ లేఅవుట్‌లో 2012లో కొమ్మాది–మధురవాడ మాస్టర్ ప్లాన్ రోడ్డు కోసం తీసుకున్న స్థలానికి టీడీఆర్ సమస్య పరిష్కరించాలని సీనియర్ సిటిజన్ డాక్టర్ చిట్టి వెంకటేశ్వరి, 92 ఏళ్ల మనుమంతరావు ఫిర్యాదు ఇచ్చారు. కొమ్మాది కే 3 కాలనీలో 600 కుటుంబాలకు జీవీఎంసీ ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు పరిశుభ్రంగా లేదని, 9 బ్లాకులకు కుళాయిలు మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి సాయి ఆధ్వర్యంలో రమణ, లక్ష్మి, మాణిక్యం తదితరలు ఫిర్యాదు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ శాంతి రాజు, ఏసీపీ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జోన్–1 కు 13 వినతులు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు 13 వినతులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి తొమ్మిది, యూసీడీ విభాగానికి రెండు, పట్టణ ప్రణాళిక విభాగానికి రెండు వినతులు వచ్చాయి.

కాలనీలో సదుపాయాల కోసం కార్పొరేటర్ వినతి

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలోని జగనన్న లే అవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు జోన్-1 జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడుకు పీజీఆర్‌ఎస్‌లో వినతి పత్రం అందజేశారు. తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ కనెక్షన్లు లేక కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

శేరిఖండంలో చోరీ

పద్మనాభం: మండలంలోని శేరిఖండంలో సోమవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన సంగు అమ్మాజీ ఉపాధి హామీ పనులకు వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయం 11.30 - 12.30 సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న 35వేలు నగదు అపహరించుకు పోయారు. క్లూస్ టీమ్ వేలి ముద్రలు సేకరించింది. ఇదే రోజు సమీపంలోని అందవరపు తరుణ్ కుమార్ ఇంటి తాళం విరగ్గొట్టి లోపలకు ప్రవేశించిన ఆగంతకులు బట్టలు చిందరవందర చేశారు. ఇంట్లో ఏమీ దొరకలేదు.

వరుస దొంగతనాలతో బెంబేలు

గ్రామంలో ఈ నెలలో మొత్తం ఆరిళ్లలో దొంగలు చొరబడటంతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. పది రోజుల క్రితం ఆర్మీ ఉద్యోగులు కొట్టాడ సతీష్, మహేష్ ఇళ్లలోకి దొంగలు ప్రవేశించారు. ఈ ఇళ్లలో బంగారం, నగదు ఏమీ లభ్యం కాలేదు. నమ్మి రాములప్పుడు ఇంట్లో రెండు కోడి పుంజులు దొంగిలించుకు పోయారు. సంగు రాంబాబు ఇంటి దగ్గర రూ.30వేలు విలువ చేసే గొర్రెపోతును అపహరించుకు పోయారు. సోమవారం రెండిళ్లలో చొరబడ్డారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలుపుదల చేయాలి

మధురవాడ: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వలన కరెంటు బిల్లులు చాలా ఎక్కువగా వస్తున్నాయని మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ సమీపంలోని అడ్రస్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ పెద్దలు సోమవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ జోన్-3 ఈఈ సింహాచలం నాయుడుకు ఫిర్యాదు ఇచ్చారు. వాటిని నిలుపుదల చేయాలని కోరారు. అసోసియేషన్ పెద్దలు కేపీవీ రావు, సురేష్, హరికృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.